

దుర్గంలో అంధకారం



గౌడ ఇందిరమ్మ కాలనీలో నెలకొన్న చీకటి

- అటకెక్కిన వీధిదీపాల నిర్వహణ
- అంధకారంలో మగ్గుతున్న 'దుర్గం' కాలనీలు, వీధులు
- నాలుగైదు నెలల నుంచి తీవ్రమైన సమస్య
- పట్టించుకోని అధికారులు

రాయదుర్గంటౌన్: స్వయానా ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు ప్రాతినిధ్యం వహించే రాయదుర్గం అంధకారంలో మగ్గుతోంది. వీధిదీపాల నిర్వహణ అస్తవ్యస్తంగా మారడంతో ప్రజలు చీకటిలో ఉండాల్సి వస్తోంది. దాదాపు నాలుగైదు నెలల నుంచి ఈ సమస్య తీవ్రంగా ఉంది. కనీసం ఒక్క కొత్త ఎల్ఈడీ లైటు కూడా స్టాక్ లేదంటే పరిస్థితి ఎంత దయనీయంగా ఉందో తెలుసుకోవచ్చు. రాత్రి వేళలో పట్టణ ప్రజలు ఆరుబయటకు అడుగు పెట్టాలన్నా.. ఆలోచించాల్సిన పరిస్థితి. ఆరు నెలలుగా కనీసం వీధిలైట్లు కూడా వెలిగించలేని కూటమి ప్రభుత్వంపై ప్రజలు బహిరంగంగా విమర్శలు చేస్తున్నారు.

రాయదుర్గం పట్టణంలో మొత్తం 32 వార్డులు ఉండగా సగానికిపైగా వార్డుల్లోని వీధుల్లో, శివారు కాలనీల్లో ఎల్ఈడీ బల్బుల కొరతతో చీకట్లు అలుముకున్నాయి. పట్టణంలో మొత్తం 3,502 లైట్లు ఉండగా వీటిలో 2,750 లైట్లు మాత్రమే పనిచేస్తున్నాయి. 400లకుపైగా లైట్లు రిపేరీ చేయాల్సి ఉంది. దాదాపు 300 కొత్త లైట్ల అవసరం ఉంది. శివారు కాలనీలతోపాటు ప్రధాన రహదారిలోని దాదాపు 20కిపైగా హైమాస్ లైట్లు సైతం వెలగడం లేదు. అవసరమైన వార్డుల్లో 10 నుంచి 20 దాకా లైట్లు అత్యవసరం కాగా, శివారు కాలనీలు, ఇందిరమ్మ కాలనీల్లో పరిస్థితి మరింత ఘోరంగా ఉంది. గౌడ ఇందిరమ్మ కాలనీలో ఉన్న అరకొర లైట్లు కూడా వెలగక పూర్తిగా అంధకారం నెలకొంది. రాత్రిపూట జనం బయటకు వచ్చే పరిస్థితి లేదు. మల్లాపురం ఇందిరమ్మ కాలనీ, ఎంపీసీ లేఅవుట్, మత్తరాసి కాలనీ, గ్యాస్ గోడౌన్ లేఅవుట్, ఎన్టీఆర్ కాలనీ, డ్రైవర్స్ కాలనీ, సిద్దేశ్వర కాలనీ, వాల్మీకీనగర్, పట్టణంలోని అనేక వీధుల్లో వీధి దీపాలు లేక చీకట్లు అలుముకున్నాయి.

కొత్త లైట్లు లేవు...
ఉన్నవాటిని మరమ్మతు చేయించరు..

మున్సిపల్ అధికారులు వీధి దీపాల నిర్వహణను అటకెక్కించారు. వీధి దీపాల కొరత తీవ్రంగా ఉంటే మరోవైపు చిన్నపాటి మరమ్మతులకు నోచుకున్న వాటిని సరి చేస్తే వినియోగంలోకి వచ్చే అవకాశం ఉంది. కొత్త లైట్లు మంజూరుకాని పరిస్థితుల్లో పని చేయని వాటికి కనీసం రిపేర్లు చేసి వినియోగంలోకి తెస్తే సమస్య కాస్త పరిష్కారమయ్యే అవకాశం ఉంటుంది.

డివైడర్లలో పనిచేయని హైమాస్ లైట్లు..

వీధులతోపాటు ప్రధాన రహదారిలోని డివైడర్లలో ఏర్పాటు చేసిన హైమాస్ లైట్లు వెలగడం లేదు. పట్టణంలోని లక్ష్మీబజార్ నుంచి వినాయక సర్కిల్, మొలకాల్మూరు రోడ్డు వరకు మొత్తం ఇరువైపులా 90 లైట్లు ఉన్నాయి. వీటిలో 20 లైట్లు వెలగడం లేదు. ప్రధాన రహదారిలోనే లైట్ల నిర్వహణ ఇలా ఉంటే వీధుల్లో పరిస్థితి అర్థం చేసుకోవచ్చు.

తీర్మానంతోనే సరిపెట్టుకున్నారు..

కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత మున్సిపల్ సమావేశంలో కౌన్సిలర్లు వీధి దీపాల కొరత తీర్చాలని గగ్గోలు పెట్టినా అధికారులు పట్టించుకోవడం లేదు. వీధిదీపాలు కొనుగోలుకు ప్రతిపాదించి తీర్మానాలు చేయడంతోనే అధికారులు సరిపెట్టుకుంటున్నారు. క్షేత్రస్థాయిలో కొనుగోలు చేసి వీధి దీపాల కొరత తీర్చాల్సిన అధికారులు ఆ దిశగా ప్రయత్నించడం లేదని కౌన్సిలర్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

కాలనీలో అంధకారం



కాలనీలో వందలాది కుటుంబాలు జీవిస్తున్నాయి. అక్కడక్కడ అరకొరగా ఏర్పాటు చేసిన వీధిదీపాలు కూడా చాలా రోజుల నుంచి వెలగడం లేదు. దీంతో కాలనీలో అంధాకారం నెలకొంది. వీధిదీపాలు ఏర్పాటు చేయాలని అధికారులకు పలుమార్లు విన్నవించినా ప్రయోజనం లేదు. రాత్రిపూట బయటకు రావాలంటే భయపడాల్సివస్తోంది. అధికారులు స్పందించి వెంటనే లైట్లు ఏర్పాటు చేయాలి.
– పంపాపతి, గౌడ ఇందిరమ్మ కాలనీ

లైట్ల మరమ్మతులకు టెండర్లు పిలిచాం



బల్బుల కొరత ఉంది. ప్రస్తుతం పనిచేయని దాదాపు 420 లైట్లను మరమ్మతు చేసి వినియోగంలోకి తెచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నాం. లైట్ల మరమ్మతుకు మెటీరియల్ కోసం రూ.7 లక్షలతో టెండర్లు పిలిచి, వర్క్ ఆర్డర్లు జారీ చేశాం. కొత్త లైట్లుకోసం ప్రతిపాదనలు తయారు చేసి ప్రభుత్వానికి పంపించాం. ప్రధాన రహదారి డివైడర్లలోని అన్ని లైట్లు మార్చి కొత్త లైట్లు కొనుగోలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. మెటీరియల్ సరఫరా అయిన వెంటనే శివారు కాలనీల్లో లైట్లు మరమ్మతు చేసి సమస్య పరిష్కరిస్తాం. – బి.ప్రతాప్, మున్సిపల్ ఏఈ

క్లుప్తంగా

అపూర్వ కలయిక


గురువులను సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

కళ్యాణదుర్గం: పట్టణంలోని స్థానిక కరణం చిక్కప్ప ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1995–96 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఆదివారం అపూర్వ సమ్మేళనం నిర్వహించారు. 28 ఏళ్ల అనంతరం ఒక చోట కలిశారు. అప్పట్లో విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానించారు. నాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు.

ఇసుక అక్రమ రవాణాను అడ్డుకున్న మహిళలు


బాదనహాళ్ హగరిలో ఇసుక రవాణాను అడ్డుకున్న మహిళలు

డి హీరేహాళ్ (రాయదుర్గం): డీహీరేహాళ్ మండలం బాదనహాళ్ హగరిలో ఇసుక అక్రమంగా రవాణా చేస్తుండగా స్థానిక మహిళలు ఆదివారం అడ్డుకున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత కొందరు అధికార పార్టీ నాయకులు బళ్లారి– రాయదుర్గం ప్రధాన రహదారికి ఆనుకుని ఉన్న హగరి నుంచి యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా చేస్తున్నారు. నిత్యం సుమారు వంద ట్రిప్పులకు పైగా ఇసుక తరలిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. సరిహద్దులో ఒక చోట డంప్ చేసి, బళ్లారి, సండూరు, బెంగళూరు తదితర ప్రాంతాలకు తరలిస్తూ రూ.లక్షల్లో ఆదాయం గడిస్తున్నారు. దీంతో కొందరు గ్రామానికి చెందిన మహిళలు ఇసుక అక్రమ రవాణాను అడ్డుకున్నారు.

వడ్డీ కట్టించుకొని రెన్యూవల్ చేయాలి

కూడేరు: స్టేట్ బ్యాంక్‌లో బంగారంపై తీసుకున్న రుణాలకు ఏడాది దాటిన తర్వాత బ్యాంకర్లు వడ్డీ మాత్రమే కట్టించుకొని రెన్యూవల్ చేయాలని బంగారుపై రుణాలు తీసుకున్న వారు కోరారు. రుణాలు తీసుకున్న పలు గ్రామాలకు చెందిన వారు ఆదివారం విలేకరులతో మాట్లాడారు. స్టేట్ బ్యాంక్ కాకుండా ఇతర బ్యాంకుల్లో కేవలం వడ్డీ కట్టించుకొని రెన్యూవల్ చేస్తున్నారన్నారు. కానీ స్టేట్ బ్యాంక్‌లో మాత్రం అసలు, వడ్డీ చెల్లించాల్సి ఉందన్నారు. దీంతో అసలు, వడ్డీ చెల్లించాలంటే ఇబ్బందిగా ఉందని వాపోయారు. స్టేట్ బ్యాంక్ ఉన్నతాధికారులు స్పందించి వడ్డీ కట్టించుకొని రెన్యూవల్ చేసుకునే అవకాశాన్ని కల్పించాలని వారు కోరారు.

తాగునీటి వృథాను అరికట్టండి


ఎస్టీ కాలనీ వద్ద వృథాగా పోతున్న నీరు

కూడేరు: మండల కేంద్రంలోని ఎమ్మార్సీ పక్కనున్న ఎస్టీ కాలనీ వద్ద ఏర్పాటు చేసిన కొళాయి వద్ద తాగునీరు వృథాగా పోతోందని గ్రామస్తులు తెలిపారు. కాలనీవాసుల సౌకర్యార్థం పంచాయతీ తరఫున కొళాయి ఏర్పాటు చేశారు. కొన్నిరోజుల క్రితం కొళాయి దిమ్మె వద్ద పైపు విరిగిపోయింది. దీంతో నీరు వృథాగా పోతోంది.

దశభుజ మహా గణపతికి విశేష పూజలు



రాయదుర్గం టౌన్:పట్టణంలోని ఆత్మకూరు వీధిలో వెలసిన దశభుజ మహాగణపతికి ఆదివారం విశేష పూజలు జరిగాయి. ప్రతి ఆదివారం స్వామి వారికి అభిషేకం, పూజలు నిర్వహిస్తారు. స్వామి వారి దర్శనానికి స్థానిక భక్తులే కాక కర్ణాటక నుంచి కూడా అధిక సంఖ్యలో హాజరై మొక్కులు తీర్చుకున్నారు.

భంభంస్వామి ఆశ్రమంలో పౌర్ణమి పూజలు



రాయదుర్గం టౌన్:పట్టణంలో నిభంభం స్వామి ఆశ్రమంలో భం షేక్ అబ్దుల్ స్వాముల జీవ సమాధిని పౌర్ణమి సందర్భంగా పెద్ద ఎత్తున తరలివచ్చి దర్శించుకున్నారు. పూర్ణమి పూజలతో పాటు ప్రత్యేక ఫాతెహా పఠించారు. ప్రతినెలా పౌర్ణమి రోజున దర్గాలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు.

వ్యక్తి అదృశ్యంపై ఫిర్యాదు

కళ్యాణదుర్గం: మండలంలోని పాపంపల్లి గ్రామానికి చెందిన రామాంజనేయులు అదృశ్యమయ్యాడని కుటుంబ సభ్యులు పోలీసులకు ఆదివారం ఫిర్యాదు చేశారు. ఆదివారం ఉదయం 8 గంటలకు ఇంటి నుంచి పొలంవద్ద కువెళ్లిన అతను.. తిరిగి రాలేదని బంధువులు, స్నేహితుల ఇళ్లలోనూ, చుట్టుపక్కల గ్రామాల్లో గాలించినా ఫలితం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు.

కడప మహాసభకు తరలివెళ్లిన ముస్లింలు

రాయదుర్గంటౌన్: కడపలో ఆల్ ఇండియా జమియతే ఉలమా–ఏ–హింద్ ఆధ్వర్యంలో వక్ఫ్ ఆస్తుల పరిక్షణ అంశం, జాతీయ ఐక్యతపై ఆదివారం సాయంత్రం జరిగిన మహాసభకు నియోజకవర్గం నుంచి ముస్లింమైనారీలు పెద్ద ఎత్తున తరలివెళ్లారు. ముఫ్తీ నూర్ మహమ్మద్, ముఫ్తీ ముదస్సీర్, ప్రభుత్వ ఖాజీ మహమ్మద్ సైఫుల్లా, మహమ్మద్ రఫీక్, మౌలీసాబ్‌లు గజాలి, జుబైర్, ఇస్మాయిల్, ఉస్మాన్, మాబుబాషా, హబీబ్ తరలివెళ్లారు.

కంబదూరు: కడపలో ఆలిండియా జమీయత్–ఉల్–మా–ఏ–హిందూముస్లిం మైనార్టీ సంఘం ఆధ్వర్యంలో జరిగిన భారీ బహిరంగ సభకు కంబదూరు నుంచి ముస్లింలు అధిక సంఖ్యలో ఆదివారం తరలివెళ్లారు. మత పెద్దలు యూనుఫ్ మౌలానా, అల్లా బకాష్, రఫీ, బాషా, నజీర్, జెబీవుల్లా,ఫయాజ్‌ల ఆధ్వర్యంలో వాహనాల్లో సభకు తరలివెళ్లారు.

గవి మఠం అభివృద్ధికి రూ.2.5 కోట్లు కేటాయించండి


మంత్రి పయ్యావులను కలిసిన పీఠాధిపతి చెన్న బసవ రాజేంద్ర మహాస్వామి

ఉరవకొండ: గవిమఠం అభివృద్ధికి సీజీఎఫ్ నిధులు రూ.2.5 కోట్లు కేటాయించాలని గవి మఠం పీఠాధిపతులు జగద్గురువు చెన్న బసవ రాజేంద్ర మహాస్వామి తదితరులు మంత్రి పయ్యావుల కేశవ్‌ను కోరారు. ఆదివారం మంత్రి స్వగ్రామం పెద్ద కౌకుంట్లలోని నివాసానికి గవి మఠం పీఠాధిపతులు వెళ్లి మంత్రితో సమావేశమయ్యారు. తమ గృహానికి వచ్చిన పీఠాధిపతులకు మంత్రి ఘన స్వాగతం పలికారు. వారి ఆశీర్వచనాలు తీసుకున్నారు. అనంతరం గవి మఠం అభివృద్ధిపై చర్చించారు. గవిమఠం అభివృద్ధికి నిధులు కేటాయించాలని వినతిపత్రాన్ని మఠం ఏజెంట్ రాజన్న గౌడ్‌తో కలిసి మంత్రికి అందించారు.

చిరస్మరణీయుడు అమరజీవి పొట్టి శ్రీరాములు

- మాజీ ఎమ్మెల్యే మెట్టు గోవిందరెడ్డి


పొట్టి శ్రీరాములు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే మెట్టు, పార్టీ నాయకులు

రాయదుర్గం: అమరజీవి పొట్టిశ్రీరాములు చిరస్మరణీయుడు అని వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే మెట్టు గోవిందరెడ్డి అన్నారు. ఆదివారం మెట్టు నివాసం వద్ద పొట్టి శ్రీరాములు వర్ధంతిని పురస్కరించుకొని వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌని ఉపేంద్రారెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప, పట్టణ కన్వీనర్ అరవ శివప్ప, మహిళా అధ్యక్షురాలు వైజాక్ రిబ్కా, కౌన్సిలర్లు, పార్టీ ముఖ్య నాయకులతో కలసి ఆయన చిత్రపటానికి పూలమాలువేసి నివాళులర్పించారు. అనంతరం మెట్టు గోవిందరెడ్డి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు గౌని లావణ్య, శ్రీనివాసురెడ్డి, శ్రీలక్ష్మి, పైతోట సంజీవ, కొంతెం దేవరాజు, తట్టే మంజు, బినాపురం మంజునాథ, కోఆప్షన్ సభ్యుడు దిలవర్‌బాషా, పార్టీ నాయకులు ఎరగుంట కేశవరెడ్డి, పొరాళ్ల శివ, గొడిశెలపల్లి రవీంద్రానాథ్ రెడ్డి, మేకల శ్రీనివాసులు, రాయంపల్లి సర్పంచ్ రామాంజినేయులు, వార్డు ఇన్‌చార్జులు గౌని శ్రీరామిరెడ్డి, ఏటూరి మహేష్, గంగాధర, బషీర్, పైతోట రఘు, ఉమేష్‌యాదవ్, మెకానిక్ బాష పాల్గొన్నారు.

వజ్రకరూరు: స్థానిక ప్రభుత్వ బీసీ బాలుర వసతి గృహంలో ఆదివారం సాయంత్రం అమరజీవి పొట్టిశ్రీరాములు వర్ధంతి వేడుకలు ఆదివారం నిర్వహించారు. అనంతరం హాస్టల్ వార్డెన్ శ్రీనివాసులు మాట్లాడారు. కార్యక్రమంలో జేవీవీ జిల్లా కార్యదర్శి మల్లికార్జున, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అమరజీవి త్యాగం మరువలేనిది

కళ్యాణదుర్గం: అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగం మరువలేనిదని ఆర్యవైశ్య సంఘం నాయకులు అన్నారు.ఆదివారం అమరజీవి వర్ధంతి సందర్భంగా గాంధీ విగ్రహానికి, అమరజీవి చిత్రపటాలకు పూలమాలలు వేసి, నివాళులర్పించారు. అనంతరం అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు, యువజన సంఘం సభ్యులు పాల్గొన్నారు.

బిడ్డల జీవితాల్లో వెలుగు నింపు తల్లీ..


బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందిస్తున్న దృశ్యం

బ్రహ్మసముద్రం : బిడ్డలను పనికి పంపకుండా బాగా చదివించి, వారి జీవితాల్లో వెలుగు నింపు తల్లీ .. అంటూ అభాగ్యురాలు మల్లీశ్వరిని ఇన్ఫినిటీ చారిటబుల్ ట్రస్టు చైర్మన్ బద్దేనాయక్,హెచ్ఎం అశోక్‌కుమార్, ఉపాధ్యాయులు సూచించారు. మండలంలోని పిల్లలపల్లికి చెందిన బోయ రమేష్ నాలుగు నెలల క్రితం గుండెపోటుతో మృతిచెందాడు. ఉన్నపళంగా ఇంటి పెద్ద మరణంతో ఆ కుటుంబం వీధిన పడినంతపనయ్యింది. రమేష్ భార్య మల్లీశ్వరి ఐదుగురు పిల్లలను పోషించలేక అవస్థలు పడుతోంది. నలుగురు కుమార్తెలు, కొడుకును చదివించాలంటే భారంగా మారింది. పూట గడవడమే కష్టంగా ఉంటే అప్పుల బాధ మరింత పెరిగింది. దీంతో పిల్లలను చదువు మాన్పించిన మల్లీశ్వరి.. వారిని కూడా కూలిపనులకు తీసుకెళ్తోంది. పిల్లలు పాఠశాలకు రావడంలేదని గమనించిన ఉపాధ్యాయులు.. తోటి గ్రామంలో ఆరాతీశారు. విషయం తెలుసుకున్న హెచ్ఎం అశోక్‌కుమార్.. ఇన్ఫినిటీ చారిటబుల్ ట్రస్టు చైర్మన్ బద్దేనాయక్ దృష్టికి తీసుకెళ్లాడు. స్పందించిన ఆయన.. ఆదివారం పిల్లలపల్లి గ్రామానికి వెళ్లి మల్లీశ్వరి కుటుంబానికి పరామర్శించారు. వారికి రూ. 20 వేలు నగదు ఆర్థిక సాయం అందించారు. పిల్లలను బాగా చదివించాలని అభాగ్యురాలికి చెప్పారు. కార్యక్రమంలో పిల్లలపల్లి హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు అశోక్ కుమార్, ఉపాధ్యాయులు నరసింహారెడ్డి, ఇన్ఫినిటీ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు హరీష్, తిప్పేస్వామి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా దత్తాత్రేయ జయంతి


బొమ్మనహాళ్‌లో గురుదత్త స్వామి


వజ్రకరూరులో దత్తాత్రేయ స్వామి


రాయదుర్గంలో దత్తాత్రేయుడు


పల్లకీ ఉత్సవం నిర్వహిస్తున్న భక్తులు

రాయదుర్గంటౌన్: పట్టణంలోని షిర్డీ సాయి ఆలయంలో ఆదివారం శ్రీదత్త జయంతి వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. దత్తాత్రేయుడి ద్వాదశ స్తోత్ర నామాలతో సాయి ఆలయంలో ఆధ్యాత్మికత వెల్లివిరిసింది. ఉదయం 6:30 గంటల నుంచి పూజలు, హోమంలో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. కాగడా హారతి, పంచామృతాభిషేకం, క్షీరాభిషేకం, సాయి దత్తవ్రతం, మహాగణపతి, ఆదిత్యాది నవగ్రహ సహిత శ్రీసాయి దత్తమాల మంత్ర హోమం నిర్వహించారు. సాయంత్రం ధూపహారతి, శేజహారతి, శ్రీసాయి భజన మండలి ఆధ్వర్యంలో సాయిభజన కార్యక్రమాలు జరిగాయి. ఆలయ కమిటీ అధ్యక్షుడు ఎస్ఎల్‌వీ రాధాకృష్ణ, ఉపాధ్యక్షుడు రామాంజనేయులు, సభ్యులు బండి కిష్టప్ప తదితరులు పాల్గొన్నారు.

బొమ్మనహాళ్: శ్రీధరఘట్టలోని గురుదత్త ఆశ్రమంలో ఆదివారం గురుదత్త జయంతి వేడుకలను భక్తులు ఘనంగా నిర్వహించారు. ఈనెల 9న ప్రారంభమైన వేడుకలు ఆదివారం ముగిశాయి. ఉదయం గురుదత్త స్వామికి ప్రత్యేక అలంకరణ, గురు దత్తాత్రేయ జయంతి, నామకరణం, డోలోత్సవం, ఉపనయనం, భిక్షబియ్యం, తీర్థప్రసాద వినియోగం, గురుదత్త హోమం, మహాపూర్ణాహుతి పూజలు చేశారు. అనంతరం ఆలయ ఆవరణలో పల్లకీ ఉత్సవం నిర్వహించారు. దత్త గురుదత్త జయంతి వేడుకల్లో భాగంగా భక్తులు ఆంధ్ర, కర్ణాటక ప్రాంతాల నుంచి వేలాది మంది తరలివచ్చారు. గురుదత్త ఆశ్రమం భక్తులతో కిటకిటలాడింది. ఆశ్రమానికి వచ్చిన భక్తులకు అన్నదానం చేసినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

వజ్రకరూరు: మండల కేంద్రంలోని షిర్డీసాయి ఆలయంలో ఆదివారం దత్తాత్రేయ జయంతి వేడుకలు నిర్వహించారు. ఉదయం ఆలయంలో దత్తాత్రేయ స్వామి విగ్రహానికి క్షీరాభిషేకం, అర్చనలు, అభిషేకం, అలంకరణ, తదితర కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ప్రసాద వితరణ చేశారు.


రాయదుర్గంలో సాయి ఆలయంలో మొక్కులు తీర్చుకుంటున్న భక్తులు


రాయదుర్గంలో దత్త మూలమంత్ర హోమంలో పాల్గొన్న భక్తులు

అయ్యప్ప ఆలయంలో రక్తదాన శిబిరం

కళ్యాణదుర్గం: పట్టణంలోని అయ్యప్ప స్వామి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఆదివారం ఆలయంలో మాలధారులు రక్తదానం చేశారు. ఉదయం నుంచి అయ్యప్ప, అంజనేయ స్వామి, శివ స్వాములు సుమారు 110 మంది రక్తదానం చేసినట్లు గురుస్వామి వెంకటేశులు, మార్కెట్ గోవిందు, రాజా గార్మెంట్స్ నిర్వాహకులు తెలిపారు. ఇందులో 30 యూనిట్ల రక్తాన్ని ప్రభుత్వాసుపత్రికి, 80 యూనిట్ల రక్తాన్ని ఆర్డీటీ ఆసుపత్రికి పంపినట్లు వారు తెలిపారు. అనంతరం ఆలయంలో అన్నదానం చేశారు.

అయ్యప్పమాలధారులకు భిక్ష

ఉరవకొండ: పట్టణంలోని అయ్యప్పస్వామి ఆలయంలో ఆదివారం అయ్యప్ప మాలధారులకు భిక్ష ఏర్పాటు చేశారు. ఆలయంలో స్వామికి ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించారు. దాతలు చింతా శరత్ 100 కేజీల బియ్యం, 30 కిలోల కంది పప్పు, నిత్య దాతలు కూరగాయలు, ఆకుకూరలు, పెరుగు అందించారు. బాలాజీ, లాలుస్వామి, డెయిరీ శ్రీలక్ష్మి, మారుతీ శ్రీజ పాలు అందిస్తున్నారు. కార్యక్రమంలో మడకశిర పంచాయరాజ్ డీఈఈ మీసుగ వెంకటేశులు తదితరులు పాల్గొన్నారు.

9 మంది పేకాట రాయుళ్ల అరెస్టు


జూదరుల అరెస్ట్ చూపుతున్న ఎస్ఐ నబీరసూల్, సిబ్బంది

బొమ్మనహాళ్: దర్గాహొన్నూరు శివారులోని పొలాల్లో ఆదివారం రాత్రి పేకాట ఆడుతున్న 9 మందిని పోలీసులు అరెస్టు చేశారు. ఎస్ఐ నబీరసూల్ తన సిబ్బందితో దాడి చేసి, యర్రగుంట హనుమంతు, చిన్నమాద ఏర్రిస్వామి, మునెగేర్ ఖలందర్, ఎర్రగుంట రవి, కన్నెయగారి శేఖర్, కొనుకొండ్ల సురేంద్ర, మనెగెరే కరీం, వ్యాసపురం దేవేంద్ర, షేక్ రెహ్మాన్‌ను అదుపులోకి తీసుకొని, వారి నుంచి రూ.59,600 నగదును, నాలుగు ద్విచక్ర వాహనాలు, 9 సెల్ ఫోన్లు, 52 పేక ముక్కలను స్వాధీనం చేసుకున్నారు. దర్గాహొన్నూరుకు చెందిన కడవలయ్య, బోయ సంగప్ప, రాకెట్లకు చెందిన రామాంజి, కణేకల్లుకు చెందిన రహంతుల్లా ఇంకా మరికొందరు పారిపోయారని, వారిని త్వరలో అదుపులోకి తీసుకుంటామని ఎస్ఐ తెలిపారు. కాగా దర్గాహొన్నూరు గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ సోదరుడు యర్రగుంట హనుమంతు అనే వ్యక్తి అధికార పార్టీ అండదండలతో గుట్టుచప్పుడు కాకుండా పేకాట నిర్వహిస్తున్నాడు. ఎన్నో సార్లు పోలీసులకు దొరకకుండా పారిపోయాడు. పక్కా సమాచారంతోనే ఎస్ఐ నబీరసూల్ దాడులు నిర్వహించి అరెస్టు చేసినట్లు తెలిపారు.

నేటి నుంచి ఇమాంషావలి ఉరుసు


నూతనంగా నిర్మించిన హజరత్ ఇమాంషావలిదర్గా


హజరత్ ఇమాంషావలి సమాధి

కణేకల్లు: మాల్యంలో హజరత్ ఇమాంషావలి ఉరుసు సోమవారం నుంచి ప్రారంభం కానుంది. మూడ్రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు నిర్వాహకులు ఫక్రుద్దీన్ తెలిపారు. సోమవారం రాత్రి గంధంతో ఉరుసు ప్రారంభమై మంగళవారం రాత్రి ఉరుసు, వేకువజామున షంషీర్ ఊరేగింపు, బుధవారం జియారత్‌తో ఉత్సవాలు ముగియనున్నాయి. నిర్వాహకులు అన్ని ఏర్పాట్లూ పూర్తి చేశారు. కులమతాలకతీతంగా హిందూముస్లింలు ఇమాంషావలిని కొలుస్తారు. ఉరుసు సందర్భంగా జరిగే షంషీర్ ఊరేగింపును తిలకించేందుకు వివిధ ప్రాంతాల నుంచి జనం తరలివస్తారు.

పునఃనిర్మాణంతో దర్గా కొత్తరూపు : పురాతన ఇమాంషావలి దర్గా కొత్తరూపు సంతరించుకుంది. దర్గాను రూ.20 లక్షలతో నూతనంగా నిర్మించినట్లు దర్గా ధర్మకర్త గంగలాపురం ఎం.ఫక్రుద్దీన్ తెలిపారు. కొత్త దర్గాతోపాటు నలువైపులా మినార్‌లు, గుమ్మాజ్ నిర్మాణం చేసినట్లు తెలిపారు. గుమ్మాజ్‌పై 3 కేజీల వెండితో తయారు చేసిన తాజ్ (కలుశం)ను ప్రతిష్ఠించినట్లు ఆయన చెప్పారు.

రాజన్న మృతదేహానికి పోస్టుమార్టం

వజ్రకరూరు: రాగులపాడు సమీపంలోని హంద్రీనీవా సుజల ప్రవంతి పథకం వద్ద శవమై తేలిన అంచి రాజన్న మృతదేహానికి ఆదివారం గుంతకల్లు ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు. హంద్రీనీవా కాలువలో శవం లభ్యమైన విషయం విదితమే. మృతదేహాన్ని విడపనకల్లు మండలం హంచనహాళ్‌కు చెందిన అంచి రాజన్న (51)దిగా గుర్తించారు. పోలీసులు పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పించారు. మృతుడికి భార్య, ముగ్గురు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. మృతుడి కుమారుడు వన్నూరుస్వామి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.